క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



మాజీ సీఎం జగన్‌కు సత్యనారాయణరెడ్డిని పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

పుల్లలచెరువు: రాష్ట్ర మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం తాడేపల్లిలో కలిశారు. చాపలమడుగు సర్పంచ్ టి.సత్యనారాయణరెడ్డి, పీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ బీవీ సుబ్బారెడ్డితో పాటు పలువురు నాయకులు జగన్‌ను కలిసి పలు సమస్యలు వివరించారు. గతంలో తాగునీటి కోసం గ్రామాల్లో ట్యాంకర్‌ల ద్వారా నీరు సరఫరా చేశామని, ఇప్పుడు నీరు సరఫరా చేయడం లేదని నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

జగనన్నతో వైఎస్సార్ సీపీ నేత ఓబులరెడ్డి భేటీ



జగనన్నతో ఎమ్మెల్యే తాటిపర్తి, ఓబులరెడ్డి

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తాను జగనన్నతో కలిసి మండల పరిస్థితులను వివరించానని ఆయన తెలిపారు.

డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యాదినోత్సవం



మాట్లాడుతున్న ఎన్‌వీ రమణ

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారతదేశంలో విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషిపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ రమణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లిపాయల లోడ్ లారీ బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు



మార్కాపురం రూరల్: పెద్దారవీడు నుంచి ఖమ్మం వెళ్తున్న ఉల్లిపాయల లోడు లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటన సోమవారం రాత్రి మార్కాపురం మండలం తిప్పాయపాలెం-జంగంగుంట్ల గ్రామాల మధ్య మిట్టమీదిపల్లి క్రాస్ రోడ్ వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నాగేంద్ర బాబు, మరో వ్యక్తి అంకిరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి.


వెల్లుపల్లెలో కొండచిలువ కలకలం



బంధించిన కొండచిలువతో అటవీ శాఖ సిబ్బంది

గిద్దలూరు రూరల్: మండలంలోని వెల్లుపల్లె గ్రామ సచివాలయం సమీపంలో కొండ చిలువ స్థానికులను భయభ్రాంతులకు గురి చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారంతో అటవీశాఖ రెస్క్యూ బృందం అశోక్, ప్రసాద్, శివ, కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని కొండచిలువను బంధించారు. అలాగే నల్లగట్ల గ్రామంలో నాగుపామును చాకచక్యంగా బంధించారు. రెండింటినీ నల్లమల అటవీప్రాంతంలో వదిలేయనున్నట్లు సిబ్బంది తెలిపారు.

ఈ వంతెనకు మోక్షం ఎప్పుడో?



కూలిన వంతెన

దొనకొండ: మండలంలోని చందవరం పంచాయతీ పరిధిలో సమ్మర్ స్టోరేజీ పక్కనే సాగర్ కెనాల్ వంతెన గతంలో అకస్మాత్తుగా కుప్పకూలింది. 1977–78 సంవత్సరంలో ప్రజల రాకపోకల కోసం దాన్ని నిర్మించారు. అప్పట్లో ఇనుప చువ్వలతో పిల్లర్స్ వేయకుండా నాసిరకం రాయితో కట్టారు. 15 ఏళ్ల క్రితం ఇరువైపులా గోడ మరమ్మతులకు గురికావడంతో కెనాల్ అధికారులు మరమ్మతులు చేయించారు. మళ్లీ మరమ్మతులకు గురైనట్లు గుర్తించి ప్రజలు ఎన్నోసార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. సుమారు 46 ఏళ్లు కావడంతో కాలపరిమితి దాటి వంతెన కుప్పకూలిపోయింది. ఈ వంతెనకు మోక్షం ఎప్పుడో, తమ కష్టాలు తీరెదెప్పుడో అని గ్రామాల్లోని ప్రజలు చర్చించుకుంటున్నారు. పశుపోషకులు నిత్యం వంతెన దాటి పశువులు తోలుకుని అవతలికి పోవాల్సి వస్తోంది. దేశిరెడ్డిపల్లె గ్రామస్తులు పొలాలకు వెళ్లాలంటే ఆ వంతెన నుంచే వెళ్లాల్సి వస్తుంది. అధికారులకు చందవరం పంచాయతీ పరిధిలోని చందవరం, దేశిరెడ్డిపల్లి, బట్టేపాడు గ్రామ ప్రజలు ఎన్నోసార్లు తెలియజేసినా ఫలితం లేకుండాపోయింది. రైతులు పండించిన ధాన్యం ట్రాక్టర్‌ల ద్వారా ఈ వంతెన మీదే వెళ్లాల్సి ఉంది. అధికారులు నిత్యం సమ్మర్ స్టోరేజీ దగ్గరకు వెళ్లాలంటే ఈ దారే దిక్కు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వేగవంతంగా వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పశుపోషకులు ఇబ్బంది పడుతున్నారు:



సాగర్ కాలువపై నిర్మించిన వంతెన కూలి పోవడంతో పశుపోషకులు చాలా ఇబ్బంది పడుతున్నారు. చందవరం, దేశిరెడ్డిపల్లి, ఎస్సీపాలెం, బట్టేపాడు గ్రామాలకు చెందిన పశుపోషకులు పశువుల మేతకు ఆ వంతెన దాటి వెళ్లాల్సి వస్తోంది. సాగర్ కాలువ ప్రవహించడంతో పశువులను మేతకు ఎక్కడికి తోలుకుని పోవాలనే ఇబ్బందికి గురవుతున్నారు. ఆ నాలుగు గ్రామాల్లో పశువుల ఎక్కువగా ఉన్నాయి. వారికి పాడి పరిశ్రమ ప్రధానమైంది. గేదెలకు మేత లేక పోవడంతో పశుపోషకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

– బందారు రాజు, ఎంపీటీసీ, చందవరం

పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది:



రైతులు పొలాలకు వెళ్లేందుకు సాగర్ కాలవపై నిర్మించిన వంతెన మరమ్మతులకు గురైంది. నిత్యం ట్రాక్టర్‌లు వెళ్లాల్సి ఉంది. పొలాలకు వెళ్లేందుకు మరో వంతెన 2 కిమీ దూరం ఉంది. దీంతో కాలయాపన జరుగుతుంది. రైతులు పండించిన ధాన్యం ఇంటికి తరలించేందుకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

– దగ్గుల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు, చందవరం

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి



అబుల్ కలాంకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయుడు, విద్యార్థులు

దొనకొండ: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయులు సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు ఆదిమూలపు ప్రభుదాసు విద్యార్థులకు అబ్బుల్ కలాం ఆజాద్ సేవలు వివరించారు. మొదటి విద్యాశాఖ మంత్రిగా 11 సంవత్సరాలు పని చేశారని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం

పెద్దారవీడు: విద్యార్థుల ఆధార్ కార్డులో పుట్టిన తేదీల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఎంఈఓ-2 ఎస్‌వీసీహెచ్ సుబ్రహ్మణ్యం అన్నారు. మండల పరిధిలోని ఏనుగుదిన్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్‌డీ అహ్మద్ అధ్యక్షతన ఉపాధ్యాయుల సమావేశం సోమవారం జరిగింది. ఎంఈఓ-2 మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అపార్ జనరేట్ జాప్యం చేయకుండా త్వరితగతిన పని అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ అపార్ నమోదులో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచేలా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. శాంప్-1 ప్రగతి మార్కుల నమోదుపై పర్యవేక్షించి ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రగళ్లపాడు గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, రికార్డులు, పిల్లల హాజరు పట్టిక, మరుగుదొడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గుర్రపుసాల చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక సోమవారం పూజలు



శ్రీ కాశీవిశ్వనాథస్వామి



పూజలందుకుంటున్న శ్రీ భవానీశంకరులు



త్రిపురాంతకం: ప్రత్యేక అలంకారంలో శ్రీపార్వతీదేవి మూలవిరాట్



కురిచేడు: శ్రీకాళహస్తీశ్వరస్వామి వారికి హారతి ఇస్తున్న అర్చకుడు



తాళ్లూరు: పూజలందుకుంటున్న మల్లికార్జున స్వామి



తాళ్లూరు: పూజలందుకుంటున్న గంగా పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి



కురిచేడు: స్వామివారి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

దర్శి:

స్థానిక శ్రీ కాశీ అన్నపూర్ణసమేత శ్రీ కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో కార్తీకమాసం రెండో సోమవారం భక్తిశ్రద్ధలతో స్వామివారికి పూజలు చేశారు. వేకువ జామున మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. పూజారి మల్లికార్జునశర్మ స్వామివారికి రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావళి, బిల్వార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

తాళ్లూరు: కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా మండలంలోని లక్కవరం శ్రీ కాశీఅన్నపూర్ణా సమేత విశ్వనాథస్వామి ఆలయంలో, ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటిగంగా భవాని అమ్మవారి ఆలయం, శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం, మాధవరం గ్రామంలోని గంగా పార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో తెల్లవారుజామున ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావళి, బిల్వార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

కురిచేడు: కార్తీక మాసం సందర్భంగా స్థానిక శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో మహిళా భక్తుల సందడి పెరిగింది. సోమవారం వేకువ జామునే ఆలయానికి చేరుకుని ముగ్గులు వేసి దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకుంటున్నారు. అనంతరం మహిళలతో పాటు అయ్యప్పమాలధారణ స్వాములు, శివమాల ధారణ స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు చేయిస్తున్నారు. ఆలయంలోని ప్రతి విగ్రహానికి పూజలు చేస్తున్నారు. భక్తులు ప్రసాదాల వితరణ చేస్తున్నారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: కార్తీక సోమవారం సందర్భంగా శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయం, శ్రీ బాలాత్రిపురసుందరీదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. త్రిపురాంతకం కార్తీక మాసం రెండో సోమవారం ఎంతో ప్రాముఖ్యమైన రోజున ఆలయాలకు భక్తులు భారీగా తరలి వచ్చారు. శ్రీత్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయంలో అభిషేకాలు, శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో కుంకుమార్చనలు అర్చకులు విశ్వనారాయణశాస్త్రి, ప్రసాదశర్మలు నిర్వహించారు. ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి వచ్చిన భక్తులకు ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చూసారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం క్యూ లైన్‌లో బారులు తీరారు. ఆలయాల వద్ద భక్తజనులు కార్తీక దీపాలు వెలిగించారు. మహిళలు పెద్ద సంఖ్యలో దీపోత్సవంలో పాల్గొన్నారు.

పుల్లలచెరువు: కార్తీక మాసం సందర్భంగా రెండో సోమవారం కావడంతో మండలంలోని శివాలయాలు భక్తులతో సందడి చేశాయి. మండల కేంద్రంలోని శ్రీ భవానీ శంకర స్వామి ఆలయంలో వేకువ జాము నుంచి భక్తులు పాల్గొని స్వామి వారికి మహా రుద్రాభిషేకాలు, బిల్వార్చన కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని స్వామి వారిని స్వహస్తాలతో అభిషేకించి, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. శతకోడులోని శక్తకోటేశ్వరఅలయంలో కూడా పూజారి కాంతారావు, ముటుకుల శివాలయంలో భరద్వాజ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాల్లో భక్తులు భారీగా చేరుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పార్వతి సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అయ్యప్పస్వామి దేవాలయం, మోట్ల మల్లికార్జునస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా చెన్నమల్లేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీశైల పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తడంతో మండల కేంద్రంలో భారీ రద్దీ ఏర్పడింది.



త్రిపురాంతకం: స్వామి వారి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో కుంకుమార్చనలు చేస్తున్న భక్తులు



కురిచేడు: శ్రీకాళహస్తీశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



త్రిపురాంతకం: శ్రీత్రిపురాంతకేశ్వరస్వామి వారి అభిషేకానికి హాజరైన భక్తులు

ఎమ్మార్పీకి మించి ఎరువులు విక్రయించొద్దు



జువారీ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ

దొనకొండ: మండలంలోని జనతా రైతు బజార్, జువారి ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల చట్టాలకు లోబడి వ్యాపారం చేసుకోవాలని, అతిక్రమిస్తే సంబంధిత లైసెన్స్‌లు రద్దు చేసేందుకు సిఫార్స్ చేస్తామని హెచ్చరించారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఎరువులను అధిక రేట్లకు అమ్మరాదని, రైతు కొనుగోలు చేసిన ఎరువుల బస్తాలకు రశీదు తప్పకుండా ఇవ్వాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్‌లను, బిల్లు పుస్తకాలను, కంపెనీల అనుమతి పత్రాలను తనిఖీ చేశారు. గోడౌన్‌లోని ఎరువుల బస్తాలకు స్టాక్ బుక్‌లో ఉన్న వివరాలు సరి చూశారు. నకిలీ ఎరువులు అమ్మిన్నట్లు తెలిస్తే ఆటువంటి డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేసేందుకు సిఫార్సు చేస్తామన్నారు. రైతులు కూడా లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచి మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. జువారీ ఎరువుల షాపులో రెండు నమూనాలు తీశారు. దిగుబడి ఎక్కువ వస్తుందని, సిఫార్సులను మించి ఎరువులు వాడరాదని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయాధికారి సూచించారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది యోగేశ్వరరావు, విన్నీబాబు పాల్గొన్నారు.

ఈతలో సత్తాచాటిన పొదిలి యువకుడు

- నాలుగు విభాగాల్లో పతకాలు కైవసం చేసుకున్న శ్రీనివాసరావు
- 3 బంగారం, 1 సిల్వర్ పతకం సొంతం



శ్రీనివాసరావుకు పతకం ఇచ్చి సత్కరిస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి

పొదిలి రూరల్: ఈత పోటీల్లో పొదిలి మండలం ఉప్పలపాడు పంచాయతీ గోగినేనివారిపాలేనికి చెందిన గోపన బోయిన శ్రీనివాసరావు సత్తా చాటాడు. నాలుగు విభాగాల్లో మూడు బంగారు పతకాలు, ఒక సిల్వర్ పతకం కై వసం చేసుకున్నాడు. రాజమహేంద్రవరంలో ఆంధ్రప్రదేశ్ 7 మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీలను మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. పోటీల్లో గోపనబోయిన శ్రీనివాసరావు 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో బంగారు పతకం, ఇండివిజువల్ మిడిల్ ఐఎం (ఇందులో నాలుగు స్ట్రోక్‌లు కలిపి ఒకే సారి చేయాల్సి ఉంటుంది) విభాగంలో రెండో బంగారు పతకం, 50 మీటర్స్ బ్యాక్ స్టాప్ విభాగంలో మూడో బంగారు పతకం సాధించాడు. నాలుగో విభాగంలో బటర్‌ఫ్లై స్ట్రోక్ (సీతాకోక చిలుక) విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. ఏపీ స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మీ నారాయణ రెడ్డి చేతుల మీదగా మెడల్స్ ఇచ్చి సత్కరించారు. వచ్చే నెలలో కర్నూల్‌లో జరగబోయే నేషనల్ మీట్‌కి ఎంపికైనందుకు పొదిలి వాసులు హర్షం వ్యక్తం చేశారు. స్విమ్మింగ్ పోటీల్లో నాలుగు పతకాలు సాధించిన శ్రీనివాసరావుకు పొదిలికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

పెట్రోల్ క్యాన్‌తో మహిళ ఆందోళన

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయింపు
- స్థల వివాదం పరిష్కరించాలని వేడుకోలు
- అధికారుల చొరవతో తహసీల్దార్‌కు వినతి
- పరిశీలించి పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ



పెట్రోల్ క్యాన్‌తో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన మల్లేశ్వరి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లేశ్వరి

కురిచేడు: స్థల వివాదం పరిష్కరించాలని కోరుతూ స్థానిక పాత పోలీసుస్టేషన్ సెంటర్‌కు చెందిన కురంగి మల్లేశ్వరి పెట్రోల్ క్యానుతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం బైఠాయించింది. దీంతో అధికారుల్లో, కార్యాలయానికి వచ్చిన వారిలో ఉత్కంఠ నెలకొంది. మల్లేశ్వరి కథనం ప్రకారం.. స్థానిక గ్రామ కంఠం 178/2 లో 0.05 సెంట్ల స్థలాన్ని తన అత్త, మామలు శ్రీ లక్ష్మీతిరుపతమ్మ ఆలయానికి రాసిచ్చారని, దానికి ప్రహరీ నిర్మిస్తుంటే తన మేనమామ కురంగి మస్తానయ్య అడ్డుకుంటున్నారని మల్లేశ్వరి తెలిపింది. సమస్య సంవత్సరాల తరబడి పరిష్కారానికి నోచుకోలేదని, రోజురోజుకూ సమస్య జటిలమై తమ ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని మల్లేశ్వరి ఆవేదన వ్యక్తం చేసింది. తహసీల్దార్ రజనీకుమారి బాధితురాలి వద్ద వినతిపత్రం తీసుకున్నారు. విచారించి స్థలాన్ని పరిశీలించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎస్‌హెచ్‌ఓ విఘ్నేష్ మల్లేశ్వరితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆమె శాంతించింది. దీంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

తాళ్లూరు తహసీల్దార్‌గా సంజీవరావు



తాళ్లూరు: మండల కేంద్రం తాళ్లూరు తహసీల్దార్‌గా కె.సంజీవరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పని చేస్తున్న ఆయన డిప్యూటేషన్‌పై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న కె.నాగలక్ష్మి డిప్యూటేషన్‌పై కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న జె.ఇమ్మానియేలు రాజు నుంచి సంజీవరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ రెవెన్యూ సంబంధ సమస్యలు ఉంటే కార్యాలయానికి వచ్చి పనులు చేయించుకోవాలన్నారు. సమస్యలు ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.